క్లుప్తంగా

రైతు బజార్‌లో దళారీల ఏరివేతకు సహకరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మూడవ పట్టణ సీఐ శేషయ్య

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజారులో దళారీలు ప్రవేశించి ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు మూడో పట్టణ సీఐ శేషయ్య హెచ్చరించారు. దళారీలను నియంత్రించేందుకు రైతుబజారులో ఇద్దరు పోలీసులు బందోబస్తుగా ఉంటారని తెలిపారు. గత నెల 27న సాక్షిలో 'రైతుబజారులో దళారీల ఇష్టారాజ్యం' శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనం వచ్చిన తర్వాత రైతుబజారు ఎస్టేటు అధికారి మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితలను కలసి రైతుబజారులో దళారీల సమస్య పెరిగిపోయిందని, వీరిని నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి టీజీ భరత్ మూడో పట్టణ పోలీసులకు రైతుబజారులో దళారీల ఏరివేతకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో శనివారం సి.క్యాంపు రైతుబజారులో రైతులు, వినియోగదారులు, పొదుపు మహిళలతో సీఐ సమావేశం నిర్వహించి దళారీలకు హెచ్చరికలు జారీ చేశారు. అంతకు ముందు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి . 90 మంది దళారీల పేర్లను సీఐకి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రకాశ్‌రావు, ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీలపై దాడులను అరికట్టాలి

కర్నూలు (సెంట్రల్): రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయరాజ్, డి.ఎర్రన్న డిమాండ్ చేశారు. మతోన్మాదులు పాస్టర్ పగడాల ప్రవీణ్‌ను పొట్టన పెట్టుకున్నారని, ఆయన మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ సిటీ కన్వీనర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ హత్యపై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, చనిపోయిన వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సీబీఐతో పూర్తిస్థాయి విచారణ చేయించేందుకు కేంద్రానికి లేఖ రాయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, నాగరాజు, సాధిక్, పఠాన్, జయరాం, దేవన్న పాల్గొన్నారు.

19న రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కర్నూలు (టౌన్): ఈనెల 19న నగరంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేయాలని సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ రెవరెండ్ ఆర్ ఆర్ జి.సజీవరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రాక్ వుడ్ చర్చిలో గుడ్‌ఫ్రైడ్ , ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని ఈవాంజిలికల్ సోల్జర్స్ టీమ్, సిటీ పాస్టర్స్, స్థానిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ టీషర్టులను ఆవిష్కరించారు. కన్వీనర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు కోల్స్ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ర్యాలీ ప్రారంభమై మౌర్య ఇన్, రాజ్‌విహార్, కలెక్టర్ ఆఫీసు మీదుగా సీ. క్యాంపు ప్రార్థన మందిరం వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో రాక్‌వుడ్ సంఘం అధ్యక్షుడు ఆనందరావు, సిటీ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి దాసుబాబు, సంఘకాపారులు జీవన్, పాల్ ఆగస్టీన్, కిషోర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 14, 15 తేదీల్లో అనంతపురం పోలీసు ట్రైనింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించేసున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటాలని రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జట్లకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడగా గుర్తింపు పొందిన రగ్బీలో రాణిస్తే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు మహబూబ్ సుభానీ, నాగశేషు, రాఘవేంద్ర, రవి, కిరణ్, సువర్ణ, నాగ శ్రీనివాసులు, అమృత పాల్గొన్నారు.

కళారత్న పురస్కార గ్రహీతకు ఘన సన్మానం

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారాన్ని పొందిన పత్తి ఓబులయ్యను ఘనంగా సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గం విద్య, కళ, సాహిత్య సంస్థలు, బలిజ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, పారిశ్రామికవేత్త టీవీ రెడ్డి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ రాముడు, జనసేన నేత చింతా సురేష్, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలికల హాస్టల్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జేసీ నవ్య



రాయలసీమ యూని వర్సిటీలో..



ఆర్ఎస్‌రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం నేతలు



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



ఆర్ఎస్ రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- సామాజిక అంతరాలను తొలగించిన సంఘ సంస్కర్త
- మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో వక్తలు

కర్నూలు కల్చరల్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని విద్యా సంస్థలు, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో సెనేట్ హాల్‌లో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ సమాజంలో సామాజిక అంతరాలను తొలగించేందుకు కృషి చేసిన మహనీయులు బాబూజీ అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, పాల్గొన్నారు.

➤జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, ఉద్యోగులు, పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, ఆదినారాయణరెడ్డి, మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు రమణయ్య, కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, జాగిర్దార్, వీరారెడ్డి, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, డీఎస్పీ మహబుబ్‌బాషా, అధ్యాపకులు, మైపర్‌లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, అధ్యాపకులు, రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌పీఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ ప్రశాంత్, దివాకర్, నాయకులు రోహిత్, చిన్న, సునీల్, నిరంజన్, జయవర్ధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సాయి సుబ్బయ్య రవీంద్ర పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

➤కర్నూలు(అగ్రికల్చర్): జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి అన్నారు. విద్యుత్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి ఎస్ఈ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

➤కర్నూలు(సెంట్రల్): మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ స్ఫూర్తి ప్రదాత అని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్‌చౌదరి, వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది జయరాజు పేర్కొన్నారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బాలసుబ్రమణ్యం, గ్రంథాల కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు మాద న్న, నాగప్ప, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

➤కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జగ్జీవన్ జయంతి కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు షేక్‌జిలానీ మాట్లాడుతూ మేరునగధీరుడు బాబూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నాయకులు దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం, బతుకన్న పాల్గొన్నారు.

➤గొప్ప సంఘ సంస్కర్త

కర్నూలు (అర్బన్) : జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త, విద్యావేత్త అని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ రామయ్య,మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు

స్ఫూర్తి ప్రదాత.. బాబూ జగ్జీవన్‌రామ్

కర్నూలు(అర్బన్): అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్‌రామ్ అందరికీ స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. పేదరికంలో జన్మించి అనేక కష్టాలను చవి చూసిన ఆయన అతి చిన్న వయస్సులో రాజకీయాల్లోకి వచ్చి అంచెలంచెలుగా దేశ ఉప ప్రధాని పదవి చేపట్టారని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ విజయమనోహరి, నాయకులు కిషన్, రైల్వే ప్రసాద్, సీహెచ్ మద్దయ్య, కేదార్, 1వ వార్డు కార్పొరేటర్ షాషావలి, జమ్మన్న, సూర్యమోహన్, సూరి, కృపా, శకుంతల తదితరులు ఆర్ఎస్ రోడ్డులోని బాబూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్వీ మాట్లాడు తూ కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలను చేపట్టిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆయా శాఖలకే వన్నె తెచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

➤ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ...

ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్ఎస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, జిల్లా అధ్యక్షుడు వీఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సి సుంకన్న, ప్రధాన కార్యదర్శి నాయకల్లు సుంకన్న, కోశాధికారి ఆర్ సంజీవకుమార్, గౌరవ సలహాదారు ఎస్‌సీహెచ్ బజారన్న పాల్గొన్నారు.

➤ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో..

బీ క్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల బాలికల హాస్టల్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి, డీఎస్పీ మహబూబ్‌బాషా, వసతి గృహ సంక్షేమాధికారిణులు బెన్నమ్మ, రజినమ్మ పాల్గొన్నారు. ముందుగా జేసీ హాస్టల్ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే విద్యార్థినులు పూలతో భారీగా స్వాగతం పలికారు. అనంతరం జగ్జీవన్‌రామ్ చిత్రపటం ముందు ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు.

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

➤ స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణ మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో అత్యాధునిక కార్డియాలజి సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి విభాగంలో అత్యాధునిక పద్ధతిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. శనివారం కార్డియాలజి విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పాతికేళ్ల కాలంలో కార్డియాలజి విభాగం విశేషంగా అభివృద్ధి సాధించిందన్నారు. 2008లో కేథలాబ్ సేవలను ప్రారంభించి వేలాది మందికి గుండెజబ్బులకు వైద్యసేవలు అందించారన్నారు. తిరిగి 2023లో నూతన కేథలాబ్ ఏర్పాటు చేసి ఇప్పటికి 1,500 మంది దాకా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ సేవలు అందించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఇక్కడ పేస్‌మేకర్లు కూడా అమరుస్తున్నట్లు తెలిపారు. కార్డియాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కళాశాల అభివృద్ధి నిధులు రూ.61 లక్షలతో నూతన 2డీ ఎకో మిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ మిషన్ ద్వారా అప్పుడే జన్మించిన శిశువులు, పిల్లలతో పాటు పెద్దలకు కూడా 2డీ ఎకో స్కానింగ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. దీనిని త్వరలో భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, కార్డియాలజి ఇన్‌చార్జ్ హెచ్‌వోడి డాక్టర్ లక్ష్మీబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రశాంత్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్‌కుమార్, లలితకుమారి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్, పేరెంట్స్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో బహుమతులు అందుకున్న చిన్నారులతో టీజీ వెంకటేశ్

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక నరసింగరావుపేటలోని శ్రీలక్ష్మి ఉన్నత పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే, పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య విజ్ఞానానికి పరిమితం కాకుండా సృజనాత్మకత ఆలోచన శక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పిల్లలకు విద్యతో పాటు సాంప్రదాయ విలువలను నేర్పించాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ డే పురస్కరించుకుని చిన్నారులకు టీజీ క్విజ్ నిర్వహించారు. ప్రతిభ చాటిన పిల్లలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్, డైరెక్టర్ పి.దీక్షిత్, కరస్పాండెంట్ పి.శేషన్న, కార్యదర్శి అరుణశ్రీ, ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత పాల్గొన్నారు.

ముస్లింలకు కూటమి సర్కారు దగా



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్

- వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఉపసంహరించుకునేంత వరకు ఆందోళనలు
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్

కర్నూలు (టౌన్): ముస్లింల మనోభావాలను కాపాడుతామని నమ్మించి కూటమి సర్కారు మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్ మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పి పార్లమెంట్, రాజ్యసభలో టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. వక్ఫ్ ఆస్తులు కాజేసేందుకు ఆయా పార్టీలు కేంద్రంతో కలిసి కుట్ర పన్నాయని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకునేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శనివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిల్లును పార్లమెంటు, రాజ్య సభలో వైఎస్సార్‌సీపీ ఏకపక్షంగా వ్యతిరేకించిందన్నారు. కర్నూలులో మంత్రి టీజీ భరత్ ఎన్నికల సమయంలో సీఏఏ, ఎన్ఆర్‌సీ విషయంలో ముస్లింలకు మద్దతుగా నిలుస్తామని పదే పదే చెప్పారన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకున్నా తమ పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. వక్ఫ్ బిల్లుకు ఆ పార్టీ మద్దతు ఇవ్వడాన్ని నిరసిస్తూ మంత్రి టీజీ భరత్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో చంద్రబాబు మద్దతు లేకుంటే బిల్లుకు ఆమోదం లభించేది కాదన్నారు. రూ. వేల కోట్లలో ఉన్న వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టి దేశంలో ఆదానీ, అంబానీలకు, రాష్ట్రంలో నారాయణ విద్యా సంస్థల అధినేత నారాయణకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమిలోని మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఏపీలోని ముగ్గురు ముస్లిం మైనార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంటనే తమ పదవులకు రాజీనామ చేసి ముస్లిం జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నగరపాలక సంస్థ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ షేక్ అహమ్మద్ మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీకి మద్దతు ఇస్తున్న చంద్రబాబు నాయుడుకు త్వరలో గుణపాఠం తప్పదన్నారు. ముస్లింలను ద్రోహం చేసిన పార్టీలను విడిచిపెట్టే పరిస్థితే లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు సలీం, నగర అధ్యక్షులు పత్తా బాషా, కార్పొరేటర్లు యూనుసు బాషా, జుబేర్, షాషావలీ, ఆర్షియా ఫర్హీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

'చెమట చెక్కిన వాక్యం' పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ రచించిన కవిత్వ పరామర్శ «చెమట చెక్కిన వాక్యం» పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి సభ్యులు తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయ సారథి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

కర్నూలు (టౌన్) : ఈనెల 6 వ తేదీ నుంచి స్థానిక పెద్దమార్కెట్ కేఎంసీ పార్కు, కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కు, వెంకటరమణ కాలనీలోని రోడ్ నెంబర్ -2లోని పార్కుల్లో ఒలింపిక్ సంఘం గుర్తించిన తైక్వాండోలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తైక్వాండో సీనియర్ శిక్షకులు టి. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాలని తెలిపారు. వివరాలకు సెల్: 98499 71256 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ మానవత్వం చూపాలి

- మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గరికపాటి

కర్నూలు కల్చరల్: సకల జీవుల పట్ల ప్రతి ఒక్కరు మానవత్వం కలిగి ఉండాలని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా బోధించారని, తన సత్యసాయి రామాయణంలో పేర్కొన్నారని మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు చెప్పారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం శౌప్రూానగర్‌లోని సత్యసాయి కళాక్షేత్రంలో మహా సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఏర్పాటు చేశారు. 'శ్రీమద్ రామాయణం' (మానవతా విలువలు- వ్యక్తిత్వ వికాసం) అనే అంశంపై గరికపాటి ప్రవచనం చెప్పారు. సీత, ఊర్మిళ ఆదర్శవంతులైన స్త్రీమూర్తులన్నారు. సమాజంలో ఎప్పుడైతే పాపాలు చేసేవారు పూర్తిగా తగ్గిపోతారో అప్పుడే భారతం, రామాయణం, భాగవతం లాంటివి అంతర్ధానమవుతాయన్నారు. ప్రతి రోజు తెల్లవారు జామున సూర్యోదయాన్ని వీక్షించిన వారిలో ఆత్మస్థైర్యం మెండుగా ఉంటుందని, ఆత్మహత్యల జోలికి వెళ్లరన్నారు. కష్టాలను, బాధలను ఓర్చుకొని నిలబడిన వారు జీవితంలో ఎప్పటికైనా విజేతలు అవుతారన్నారు. క్లబ్, పబ్ కల్చర్‌కు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. చెడును కలిగించే ప్రాంతాలకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ సతీమని టీజీ రాజ్యలక్ష్మి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబ, జిల్లా సేవాదల్ బాధ్యులు లక్ష్మీ సరోజ, యూత్ మహిళా కోఆర్డినేటర్ గీతావాణి, సభ్యులు సూర్య నారాయణ రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు

జీడీఏ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ

కర్నూలు(హాస్పిటల్):నగరంలోని జొహరాపురం రోడ్డులో ఉన్న బొల్లినేని మెడిస్కిల్స్‌లో జీడీఏ (నాలుగు నెలలు), ఓటీ అసిస్టెంట్ (సంవత్సరం) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు చేసేందుకు టెన్త్, ఇంటర్ పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఆసక్తిగల వారు 86865 94534, 76809 45357 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రాములోరి కల్యాణానికి రారండోయ్

కర్నూలు కల్చరల్: సకలగుణ శీలుడు సీతా సమేత శ్రీరాముడి కల్యాణం భక్తులకు నయనానందకరం. ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇప్పటికే దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో సంబంధిత ఈఓలు, ఇతర ఆలయాల్లో ఆయా ఆలయాల కమిటీలు కల్యాణోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11.48 గంటలకు, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 6.30 గంటలకు, ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయి బాబా దేవాలయంలో ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం జరుగనుంది. వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్, వెంకటేశ్వర స్వామి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, బుధవారపేట ఈశ్వర ఆంజనేయ స్వామి ఆలయం, బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయస్వామి ఆలయం, కొత్తపేట, శ్రీరామనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలు, ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం, లలితా పీఠం, అంబా భవాపీ ఆలయం, కొత్త పేట కోదండ రామాలయం, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

➤ తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామాలయ, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన సామగ్రిని విశ్రాంత వైద్యాధికా రి మోక్షేశ్వరుడు అందజేశారు.కార్యక్రమంలో కొత్తపల్లి రామాలయం కమిటీ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, అర్చకులు శ్రీనివాసులు, ప్రతాప్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కర్నూలు (సెంట్రల్): మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 11వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆందోళనలో ఎక్కువ మంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినా నారాయణ, చైతన్య, ఎస్ఆర్, మస్టార్ మైండ్స్ కళాశాలలు తరగతులు నిర్వహించడం సరికాదని, ఆ విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబుబకర్, సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయా కళాశాలల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.